* కొడవటిగంటి కుటుంబరావు *

# కథాసాహిత్యం - పత్రికలూ

★

కథ అనేది ఏభాషలోనైనా అతి ప్రాచీనమైనదే ప్రపంచంలో మానవ సమాజమనేది ఏర్పడుతూనే కథ అనేది పుట్టిఉండాలి. కథ మానవసమాజానికి పునాదిగాకూడా పనిచేసి ఉండాలి. చరిత్రా, వ్యక్తుల భిన్నభిన్నానుభవాలూ కథలరూపంలో సమాజానికి సంక్రమించాయి. ఆచార వ్యవహారాలూ, విజ్ఞానమూ, నీతీ మొదలైనవి కథలద్వారానే ప్రచారం అయిఉండాలి. సాంఘిక పరిణామంలో ఎన్నెన్ని సాహిత్య స్వరూపాలు వెలువడినా వాటికి కథే ఆధారంగా ఉంటూవచ్చింది. కాని ఈ ఇతర సాహిత్య రూపాలు కథను వెనక్కి తోసేశాయి.

మొదటి ప్రపంచయుద్ధం అయేవరకూ ఆధునిక తెలుగు సాహిత్యంలో కథకు ఎటువంటి స్థానమూ లేదనేచెప్పాలి. అన్ని సాహిత్యరూపాలలోనూ కృషి చేసిన వీరేశలింగంగారు కథజోలికి రాలేదు. అప్పట్లో పద్యానికీ, నవలకీ, నాటకానికీ, వ్యాసానికీ ఉన్న ఘనత కథకి లేకపోయింది. దానికి కారణం లేకపోలేదు. సాంఘిక ప్రయోజనం సాధించటానికి చిన్న కథ ప్రశస్తమైన పరికరం కాదు. అందులో సంఘాన్ని విపులంగా చిత్రించే అవకాశం లేదు. శిల్పచాతుర్యం చూపటానికి మటుకే అవకాశం ఉంది.

1919 నుంచీ ఈ శిల్పచాతుర్యానికి కూడా స్థానం లభించసాగింది సాహిత్యంలో. ఈ నూతన పరిణామఫలితంగా ఖండకావ్యమూ, చిన్నకథా ప్రాముఖ్యానికి వచ్చాయి. అచ్చగా కథలురాసినవారు కూడా సాహితీపరులనిపించుకోసాగారు. మొదటి ప్రపంచయుద్ధానికి పూర్వం ఇది సాధ్యంకాలేదు.

తెలుగుసాహిత్యంలోకి అడుగుపెడుతూనే చిన్నకథ ప్రజాదరణ సంపాదించుకుని ఇతర సాహిత్యస్వరూపాలని వెనక్కి తోయసాగింది. చిన్న కథా, ఖండకావ్యమూ బయలుదేరి దిగ్విజయంచేసి వచ్చాయి. ఇందువల్ల తెలుగు సాహిత్యానికి కొంత అపకారం జరిగిందనేది నిర్వివాదాంశం. ఈ దిగ్విజయంవల్ల ప్రజలకి ఘనమైన సాహిత్యంమీద విముఖత్వం కలిగింది. యథార్థమైన సాహిత్య ప్రయోజనం వెనకపడి రచయితల విశిష్టతకూ, ప్రత్యేకత్వాలకూ, శిల్పానికీ ప్రాధాన్యం ఏర్పడింది. నవలా, నాటకమూ వెనకపడి

• విమర్శ •

చిన్నకథా, ఖండకావ్యమూ, ఏకాంకికా మొదలైన వాటికి ప్రచారం హెచ్చింది. నిజానికి ఇవి బలమైన సాహిత్యం కావు.

అయితే ఒకటి అనుకోవచ్చు. సాహిత్యం ఏ కొద్దిమంది ఆదరణనో పొందుతూ అసంఖ్యాకులైన ప్రజలకు అది అందుబాటులో లేని సమయంలో ఈ చిన్నకథా ఖండకావ్యమూ వచ్చి వారిలో సాహిత్యపిపాస రేకెత్తించాయనుకోవచ్చు; ఈ స్వరూపాలు పైకివచ్చి ఉదాత్తమైన సాహిత్యంమీద అభిమానం గలవారిని పాడుచేయలేదనుకోవచ్చు. ఈ వాదన కొంతమటుకే నిజం. ఎందుకంటే చిన్నకథకి ప్రాముఖ్యంలేని కాలంలో నాటకమూ, నవలా ముందుకు వచ్చాయి. వీరేశలింగంగారు నాటినచెట్టు ఫలించి అనేక నవలలూ, నాటకాలూ వెలువడ్డాయి. చిన్నకథ బయలుదేరిన తరవాతకూడా వీటి ప్రచారం కొంతకాలం బాగానే ఉండింది.

అయితే యింతలో పత్రికలు వచ్చాయి. చిన్నకథాఖండకావ్యమూ ఆరంభించిన పనిని ఈ పత్రికలు పూర్తిచేశాయి. పత్రికల విజృంభణతో ఈ స్వరూపాలకు ఎంతో ప్రచారమైనా సాగింది. (పత్రికలు లేనిచోట చిన్నకథకు ఇంత ప్రాముఖ్యం వచ్చే అవకాశమే లేదనుకోవచ్చు)

పత్రికలు పుస్తకాలకంటె చౌక. ప్రకటనల ఆధారంతో అవి చౌకబారు అభిరుచులను సంతృప్తిపరుస్తూ, అసంఖ్యాక ప్రజలకు చౌకబారు సాహిత్యాన్ని అందిస్తాయి. అనేకమంది రచయితల, వివిధ రూపాల రచనలు వాటిలో ప్రకటితమవుతాయి. జరుగుతున్న విషయాలమీద వ్యాఖ్యానాలుంటాయి. బరువైన సాహిత్యం జోలికిపోని లక్షలాది ప్రజలు పత్రికలకెగబడతారు. సుదీర్ఘమైన నవలలూ, నాటకాలూ వీటిలో వెలువడే అవకాశం తక్కువ. విడిగా అచ్చువేసినట్టయితే నవలలూ, నాటకాలూ, ఈపత్రికలంత చౌకగా అమ్మవు. నికరమైన, నిశ్చలమైన సాహిత్యాభిలాష కలవారు కొందరు పుస్తకాలు కొన్నప్పటికీ పత్రికలు చదివేవారి సంఖ్యతో పోలిస్తే వారి సంఖ్య అల్పం.

పత్రికలు వచ్చి అధిక సంఖ్యాకులలో చౌకబారు సాహిత్యంమీద అభిలాష కలిగించినమాట నిజమే. అయినా, బలమైన సాహిత్యంమీద అభిలాష గల వారి సంఖ్య వీటివల్ల పెరగలేదనేది నిశ్చయం. అటువంటి సాహిత్యప్రియులసంఖ్య తగ్గిందేమో అనిపిస్తుందికూడాను. జరిగిన 30 ఏళ్ల కాలంలోనూ ఒక లక్ష చిన్న కథలు పత్రికలద్వారా వెలువడ్డాయని అంచనా కడితే అందులో రెండు వేలన్నా పుస్తకరూపంలో వెలువడ్డాయనుకోవటానికి అవకాశం లేదు. పైపెచ్చు ఈ 30 ఏళ్ళలోనూ నవలా, నాటకమూ క్రమంగా క్షీణించాయి.

ఇది తెలుగు సాహిత్యానికి తీరని నష్టం. అందుకని మనం పత్రికలను అణచటంగాని, కథాసాహిత్యాన్ని వెలి వెయ్యటంగాని సాధ్యం కానిపని. ఈ నష్టం మరొక విధంగా మనం పూడ్చుకోవాలి. దీనికోసం ఇదివరలో జరిగిన ప్రయత్నాలు విఫలమయినాయనే చెప్పాలి. సాహితీ, శారదా సఖీ, భారతీ, జయంతీ, ఉదయినీ, తెలుగుతల్లీ, అభ్యుదయా, ప్రతిభా మొదలయిన

సాహిత్య పత్రికలకు ఆంధ్రలోకం చూపిన ఆదరం చూస్తే దేశంలో సాహిత్యప్రియులంటూ ఎవరైనా ఉన్నారా అనే సందేహం ఎవరికైనా కలుగుతుంది

చౌకబారు పత్రికల్లోనే మంచి సాహిత్యంగా పరిగణించదగిన కథలూ, ఖండ కావ్యాలుకూడా వెలువడుతున్నాయి; తుక్కు రచనలతో బాటు! ఈ పరిస్థితి ఏ యితర భాషా సాహిత్యంలోనూ ఉన్నట్టు కనబడదు. తెలుగులో నాలుగైదు ఉత్తమ సాహితీ పత్రికలు వెలువడి, ఆర్థికంగా వాటికి మంచి పునాది ఏర్పడి సాహిత్య ప్రియులు కాగోరేవారు విచక్షణా జ్ఞానంతో వాటిని పోషించడానికి పూనుకున్ననాడు నీళ్ళకి నీళ్ళూ, పాలకి పాలూ విడిపోతాయి.

సాహిత్య సంస్థలు నడిపే పత్రికలు కూడా కళాకాంతులు లేకుండా, నాశనమై పోవటానికి కారణాలు ఆలోచించదగినవి. ఈ పత్రికలకు ఆర్థిక సహాయం లేదు. ఇందులో రాసేవాళ్ళకి పారితోషికాలు లేవు మనకున్న ఉత్తమ రచయితలు వీటిలోనే రాస్తారనే నమ్మకం లేదు. వీటికి ప్రకటనల మద్దతు లేదు. వీటికి ప్రత్యేకించి అందమైన స్వరూపం లేదు. ఇదంతా ఒక ఉద్యమంగా సాగాలి. సాహిత్య ప్రియులైన రచయితలూ, పాఠకులూ, కలిసిగాని వేరు వేరుగాగాని ఈ ఉద్యమానికి స్వరూపం ఇవ్వాలి.

కథాస్వరూపం పత్రికల దోపిడీకి అనుకూలంగా ఉన్నదన్న మాటేగానీ, కథకూడ కొద్దిలో ఉత్తమ సాహిత్య ధర్మం నెరవేర్చగలదనడానికి ప్రబలమైన సాక్ష్యం ఉంది. ఆ సాహిత్యం చౌక పత్రికలలో పడి వాటితోపాటే నశించిపోకుండా చూడాలి.

పత్రికలకన్నా కూడా అధిక ప్రచారం జరగవలసినది పుస్తకాలకు. ఉత్తమతరగతి కథలతోపాటు నవలలూ, నాటకాలూ కూడా వెలువడేందుకు మార్గం ఏర్పడ్డనాడు మన సాహిత్యానికి చౌకబారు సాహిత్యం నుంచీ, పత్రికలనుంచీ విముక్తి ఏర్పడుతుంది.

---

తాము విశ్వసించి కృషి చేసే ఆదర్శానికి ప్రమాదం వచ్చినప్పుడు :

"నిజాయితీపరులు ప్రతిఘటిస్తారు, ద్రోహులు బైటపడతారు, వీరులు పోరాడుతారు, బలహీనులు దిగజారి పోతారు."

— ఫ్యూజిక్

---